# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 16-10-2024 సమయం : రాత్రి 8 గం. 30 ని.లు

## ముఖ్యాంశాలు

❖ మూడు దేశాల పర్యటనలో భాగంగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఈరోజు మౌరిటానియాకు చేరుకున్నారు.

❖ దేశంలో రబీ పంటలకు కనీస మద్దతు ధరలను పెంచుతూ కేంద్రమంత్రివర్గం నిర్ణయం తీసుకుంది.

❖ ఉగ్రవాదం, తీవ్రవాదం వేర్పాటువాదం అభివృద్ధిని నిరోధించే శక్తులుగా కేంద్ర విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ అభివర్ణించారు.

❖ దేశీయ తయారీ రంగంలో నాణ్యతకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ తెలిపారు.

❖ భారత మహిళా క్రికెటర్ నీతూ డేవిడ్ కు ప్రతిష్టాత్మక ఐసీసీ హాల్ ఆఫ్ ఫేమ్ లో చోటు దక్కింది.

==========================

మూడు దేశాల పర్యటనలో భాగంగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఈరోజు మౌరిటానియా చేరుకున్నారు. నౌక్‌చాట్-ఔమ్‌టౌన్సీ అంతర్జాతీయ విమానాశ్రయంలో రాష్ట్రపతికి మౌరిటానియా అధ్యక్షులు మొహమ్మద్ ఔల్డ్ ఘజౌని ఘన స్వాగతం పలికారు. మౌరిటానియా ఒక రోజు పర్యటనలో భాగంగా ద్రౌపది ముర్ము ద్వైపాక్షిక సమావేశాలతో పాటు ప్రవాస భారతీయుల సమావేశంలో పాల్గొంటారని అధికార వర్గాలు తెలిపాయి. ఇదిలా ఉండగా, ద్రౌపది ముర్ము ఇస్లామిక్ రిపబ్లిక్ ఆఫ్ మౌరిటానియా ప్రెసిడెంట్ మొహమ్మద్ ఔల్డ్ ఘజౌనీతో చర్చలు జరపనున్నారు. అనంతరం రాష్ట్రపతి మూడు దేశాల పర్యటనలో చివరిదైన మలావికి బయలుదేరుతారని అధికార వర్గాలు వెల్లడించాయి.

==========================

దేశంలో వ్యవసాయానికి ఊతమిస్తూ.. 2025-26 మార్కెటింగ్ సీజన్ కోసం రబీ పంటలకు కనీస మద్దతు ధరలను పెంచుతూ... కేంద్రమంత్రివర్గం నిర్ణయం తీసుకుంది. న్యూఢిల్లీలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన ఈరోజు జరిగిన మంత్రివర్గ నిర్ణయాలను కేంద్ర సమాచార, ప్రసార శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ పాత్రికేయులకు వివరించారు. వ్యవసాయదారుల ఉత్పత్తులకు లాభదాయకమైన ధరలను నిర్ధారించడానికి ప్రభుత్వం రబీ పంటల కనీస మద్దతు ధరను పెంచిందని ఆయన పేర్కొంటూ..

(వాయిస్ 20 సెకన్లు)

==========================

ఉగ్రవాదం, తీవ్రవాదం వేర్పాటువాదం అభివృద్ధిని నిరోధించే శక్తులుగా కేంద్ర విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ పేర్కొన్నారు. పాకిస్థాన్‌లోని ఇస్లామాబాద్‌లో ఈ రోజు జరిగిన షాంఘై కో-ఆపరేషన్ ఆర్గనైజేషన్ కౌన్సిల్ ఆఫ్ హెడ్స్ 23వ సమావేశంలో ఆయన మాట్లాడుతూ... శాంతి, స్థిరత్వం మీదనే అభివృద్ధి ఆధారపడి ఉంటుందని స్పష్టం చేశారు. సరిహద్దు కార్యకలాపాలతో పాటు, వాణిజ్యం మీద కూడా ఉగ్రవాదం ప్రభావం అధికంగా ఉంటుందని అన్నారు. దేశాల మధ్య సహకారం పరస్పర గౌరవం, సార్వభౌమ సమానత్వం ప్రాదేశిక సమగ్రతను అంతా గుర్తించాలని కేంద్ర మంత్రి పేర్కొంది.

==========================

దేశీయ తయారీ రంగంలో “నాణ్యత”కు అధిక ప్రాధాన్యమిచ్చేందుకు ప్రభుత్వం “జీరో డిఫెక్ట్, జీరో ఎఫెక్ట్” విధానంతో పని చేస్తోందని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ తెలిపారు. న్యూ ఢిల్లీలో ఈ రోజు జరిగిన మొదటి ఇండియన్ ఫౌండేషన్ ఫర్ క్వాలిటీ మేనేజ్‌మెంట్ సింపోయిజమ్ కార్యక్రమంలో ఆయన ప్రసంగిచారు. తయారీ రంగంలో నాణ్యమైన పర్యావరణ వ్యవస్థని నెలకొల్పేందుకు సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు ప్రభుత్వంతో భాగస్వాములు కావాలని కేంద్ర మంత్రి పేర్కొంటూ...

(వాయిస్ 22 సెకన్లు)

==========================

జమ్మూకశ్మీర్ ముఖ్యమంత్రిగా నేషనల్ కాన్ఫరెన్స్ నాయకులు ఒమర్ అబ్దుల్లా ఈ రోజు ప్రమాణస్వీకారం చేశారు. ఆర్టికల్-370 రద్దు తర్వాత కేంద్రపాలిత ప్రాంతంగా మారిన జమ్మూకశ్మీర్ కు ఆయన మొదటి ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించారు. ఒమర్ అబ్దుల్లాతో పాటు మరో ఐదుగురు మంత్రులు ప్రమాణస్వీకారం చేశారు. ఉప ముఖ్యమంత్రిగా సురీంద్ర కుమార్ చౌదరీ నియమితులయ్యారు. శ్రీనగర్‌లోని షేర్-ఇ- కశ్మీర్ ఇంటర్నేషనల్ సెంటర్‌లో ఒమర్ అబ్దుల్లాతో లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా ప్రమాణస్వీకారం చేయించారు. ఈ కార్యక్రమానికి లోక్ సభ ప్రతిపక్ష నాయకులు రాహుల్ గాంధీ, కాంగ్రెస్ జాతీయ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే, పీడీపీ నాయకులు మెహబూబా ముఫ్తీ, సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్, సీపీఐ నాయకులు డి.రాజా హాజరయ్యారు. ఇదిలా ఉండగా, జమ్మూ కాశ్మీర్ నూతన ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లాకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సామాజిక మాధ్యమం ద్వారా అభినందనలు తెలియజేశారు. జమ్మూ కాశ్మీర్ పురోగతి కోసం అబ్దుల్లాతో కలిసి కేంద్ర ప్రభుత్వం పని చేస్తుందని ఆయన స్పష్టం చేశారు.

విరామం

==========================

హరియాణా బీజేపీ శాసనసభా పక్ష నేతగా నాయబ్ సింగ్ సైనీ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. చండీగఢ్ లో ఈ రోజు జరిగిన సమావేశంలో కొత్తగా ఎన్నికైన బీజేపీ ఎమ్మెల్యేలు సైనీని శాసనసభాపక్ష నేతగా ఎన్నుకున్నారు. కేంద్ర

పరిశీలకులుగా ఈ  సమావేశానికి హోంమంత్రి అమిత్ షా, మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి మోహన్ యాదవ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా హరియాణాలో గడచిన 10 సంవత్సరాల కాలంలో ఎంతో అభివృద్ధి జరిగిందని అమిత్ షా అన్నారు. ప్రతి అగ్నివీర్‌కు పెన్షన్‌తో కూడిన ఉద్యోగాన్ని ఇస్తామని ఆయన హామీ ఇచ్చారు.

==========================

న్యూఢిల్లీలో జరుగుతున్న ఐఎస్ఎస్ఎఫ్ వరల్డ్ కప్ ఫైనల్లో 50 మీటర్ల రైఫిల్ విభాగంలో భారత షూటర్ అఖిల్ షెరోన్ కాంస్య పతకం సాధించారు.

భారత్ - న్యూజిల్యాండ్ జట్ల మధ్య బెంగూళూరు వేదికగా ఈ రోజు ప్రారంభమైన మొదటి టెస్టు మ్యాచ్ తొలి రోజు ఆట వర్షం కారణంగా నిలిచిపోయింది.

మరోవైపు అత్యున్నత ఐసీసీ హాల్ ఆఫ్ ఫేమ్ కు ముగ్గురు క్రికెటర్లను ఎంపిక చేశారు. భారత మహిళా క్రికెటర్ నీతూ డేవిడ్, దక్షిణ ఆఫ్రికా ఆడగాడు ఎబి డెవిలియర్స్, ఇంగ్లాండ్ కుచెందిన అలెస్టర్ కుక్ ఈ జాబితాలో చోటు దక్కించుకున్నారు.

==========================

జాతీయ భద్రతా దళం (ఎన్ఎస్‌జి) ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ రోజు శుభాకాంక్షలు తెలిపారు. దేశాన్ని రక్షించడంలో అచంచలమైన అంకితభావం, ధైర్యం సంకల్పంతో కృషి చేస్తున్న NSG సిబ్బందికి దేశం అభినందనలు  చేస్తున్నట్టుగా సామాజిక మాధ్యమం ద్వారా  ప్రధానమంత్రి పేర్కొన్నారు. అనేక రకాలైన ముప్పు నుండి దేశాన్ని రక్షించడంలో NSG సిబ్బంది చూపిస్తున్న నిబద్ధత ప్రశంసనీయమని నరేంద్ర మోదీ అన్నారు.

==========================

కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు పెన్షనర్లకు కరవు భత్యాన్ని 3 శాతం పెంచుతూ కేంద్ర మంత్రివర్గం ఆమోదించింది. కరవు భత్యం పెంపుదల వల్ల 49 లక్షల మంది కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, 64 లక్షల మంది పెన్షనర్లు ప్రయోజనం దక్కుతుందని అధికార వర్గాలు తెలిపాయి. దీని వల్ల ఖజానాపై సంవత్సరానికి 9,448 కోట్ల రూపాయలపైగా ప్రభావం పడుతుందని పేర్కొన్నాయి. ఢిల్లీలో ఈ రోజు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అధ్యక్షతన జరిగిన మంత్రివర్గ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు.

==========================

మరో 24 గంటల పాటు చెన్నై, తిరువళ్లూరు, కాంచీపురం, చెంగల్‌పేట జిల్లాల్లో పలు ప్రాంతాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ప్రాంతీయ వాతావరణ శాఖ అంచనా వేసింది. వాతావరణ శాఖ ప్రాంతీయ అధిపతి బాలచంద్రన్ ఈ రోజు పాత్రికేయులతో మాట్లాడుతూ.. అల్పపీడనం గంటకు 15 కిలో మీటర్ల వేగంతో కదులుతుందని, చెన్నై తీరానికి 320 కిలోమీటర్ల దూరంలో కేంద్రీకృతమై ఉందని తెలిపారు. రేపు తెల్లవారుజామున ఉత్తర తమిళనాడు, దక్షిణ ఆంధ్ర, కోస్తా మధ్య తీరం దాటే అవకాశం ఉందన్నారు. అంతే కాకుండా దాదాపు పది జిల్లాల్లో మరో నాలుగు రోజుల పాటు ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపారు.

==========================

భారతీయ జనతా పార్టీ కార్యకర్తగా ఉన్నందుకు గర్విస్తున్నామని ప్రధానమంత్రి  నరేంద్ర మోడీ అన్నారు. ఢిల్లీలో ఈ రోజు బీజేపీ జాతీయ అధ్యక్షులు జేపీ నడ్డా సమక్షంలో ఆయన సక్రియ సదస్యత అభియాన్‌ను ప్రారంభించారు.  క్షేత్ర స్థాయిలో బీజేపీని మరింత బలోపేతం చేసేందుకు సక్రియ సదస్యత అభియాన్ ఒక ఉద్యమ కార్యక్రమమని అభివర్ణించారు. పార్టీ కోసం పనిచేసే వారికి అవకాశాలు ఎన్నో  లభిస్తాయని  ఈ మేరకు ఆయన సామాజిక మాధ్యమం ద్వారా పేర్కొన్నారు.

===========================

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు ఈరోజు నష్టాల్లో ముగిశాయి. సెన్సెక్స్ 318.76 పాయింట్ల నష్టంతో 81,501.36 వద్ద ముగిసింది. నిఫ్టీ సైతం 86.05 పాయింట్ల నష్టంతో 24,971.30 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 84 గా ఉంది. అంతర్జాతీయ మార్కెట్‌లో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 74.06 డాలర్లు, బంగారం ఔన్సు 2,694.80 డాలర్ల వద్ద కొనసాగుతున్నాయి.

===========================

స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించి, నిర్మించిన అత్యాధునికమైన “షిప్ ఫైర్ ఫైటింగ్ ట్రైనింగ్ ఫెసిలిటీ సెంటర్”ను విశాఖపట్నంలోని INS విశ్వకర్మలో చీఫ్ ఆఫ్ స్టాఫ్ వైస్ అడ్మిరల్ సమీర్ సక్సేనా ఈ రోజు ప్రారంభించారు. “అగమ్య” అనే పేరుతో ఏర్పాటు చేసిన ఈ ఫెసిలిటీ సెంటర్ ని ఆత్మ నిర్భర్ భారత్ స్ఫూర్తితో తీసుకువచ్చినట్లు అధికార వర్గాలు తెలిపాయి. దేశరక్షణ సామర్థ్యపు స్వావలంబనకు ఇది నిదర్శనంగా పేర్కొన్నాయి.

===========================
===========================